మహిళలే జగనన్న సైన్యం

- ఎన్నికల్లో మరోసారి సీఎంను చేద్దాం
- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, రాజమహేంద్రవరం పార్లమెంటరీ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్

ఉండ్రాజవరం: ప్రతి కార్యక్రమంలో మహిళలకు లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా సీఎం జగన్‌మోహన్ రెడ్డి పనిచేస్తున్నారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. మండలంలో పాలంగి గ్రామంలో మండల స్థాయి వైఎస్సార్ ఆసరా నాలుగో విడత సంబరాలు సోమవారం నిర్వహించారు. ముందుగా దివంగత ముఖ్యమంత్రి మహనేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద జ్యోతి వెలిగించి, పూలమాలలు వేశారు. ఈ సభకు మండల వ్యాప్తంగా మహిళలు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమానికి విచ్చేసిన వైఎస్సార్ సీపీ రాజమహేంద్రవరం పార్లమెంట్ కోఆర్డినేటర్ గూడూరి శ్రీనివాస్‌ను ఎమ్మెల్యే మహిళలకు పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు, ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ 2014 ఎన్నికల సమయంలో డ్వాక్రా సంఘాలకు రుణమాఫీ చేస్తామని టీడీపీ అధినేత చంద్రబాబు హామీ ఇచ్చి మోసం చేశారన్నారు. 2019 ఎన్నికల్లో జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీ నెరవేర్చారని, నాలుగో విడతల్లో రుణమాఫీ చేశారన్నారు. మహిళలే జగనన్న సైన్యమని, మనం కేవలం రెండు బటన్లు ఫ్యాన్ గుర్తు మీద నొక్కి జగనన్నను మరోసారి ముఖ్యమంత్రిని చేద్దామన్నారు. అనంతరం మండలంలో 1299 డ్వాక్రా సంఘాలకు చెందిన 12,759 మంది లబ్ధిదారులకు రూ.11.35 కోట్ల నమూనా చెక్కును గూడూరి శ్రీనివాస్‌తో కలసి ఎమ్మెల్యే అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు నందిగం భాస్కరరామయ్య, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బూరుగుపల్లి సుబ్బారావు, ఎంపీపీ పాలాటి యల్లారేశ్వరి, మండల జేసీఎస్ కన్వీనర్ కఠారి సిద్ధార్థరాజు, శ్రీనివాస్‌నాయుడు తనయుడు వరణ్‌సాయి, మండల రైతు విభాగం అధ్యక్షుడు కోతారు సత్యనారాయణ, మహిళా సమాఖ్య అధ్యక్షురాలు సుజాత, ఎంపీఎం కంభం వేణు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, సొసైటీ అధ్యక్షులు పాల్గొన్నారు.



పాలంగిలో మహిళలకు నమూనా చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు

క్లుప్తంగా

రాజ్యసభ అభ్యర్థి సుబ్బారెడ్డిని కలిసిన హోం మంత్రి వనిత



సుబ్బారెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మంత్రి వనిత

దేవరపల్లి: రాజ్యసభ వైఎస్సార్ సీపీ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన వైవీ సుబ్బారెడ్డిని సోమవారం సాయంత్రం రాష్ట్ర హోం మంత్రి, గోపాలపురం నియోజకవర్గం ఇన్‌చార్జి తానేటి వనిత తాడేపల్లిలో కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రాజ్యసభ ఎన్నికల్లో విజయం సాధించడం ఖాయమని, ముందస్తు శుభాకాంక్షలు తెలుపుతున్నట్టు ఆమె చెప్పారు. గోపాలపురం నియోజకవర్గంలోని రాజకీయ పరిస్థితులపై మంత్రి వనితను ఆయన అడిగితెలుసుకున్నారు.

క్షేత్రస్థాయిలో పరిశీలనతోనే విద్యార్థులకు విజ్ఞానం

ఉండ్రాజవరం : పారిశ్రామిక కర్మాగారాల పరిశీలనతోనే విద్యార్థులకు విజ్ఞానం లభిస్తుందని ఉండ్రాజవరం ఉన్నత పాఠశాల హెచ్ఎం వి.విశ్వప్రసాద్ అన్నారు. స్థానిక పాఠశాలకు చెందిన వృత్తి విద్య కోర్సుల విద్యార్థులను క్షేత్రస్థాయి పరిశీలనకు సోమవారం తణుకులోని పాలిటెక్నిక్ కళాశాలకు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా కళాశాలలో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగం, ల్యాబ్ పనితీరును వివరించారు. ప్రాక్టికల్‌గా చూడడం వల్ల వైజ్ఞానిక నైపుణ్యత పెంపొందించడానికి, విద్యార్థులకు అవగాహన కల్పించడానికి దోహదపడతాయని విశ్వప్రసాద్ అన్నారు.

రక్తదానం



కళాశాలలో రక్తదానం చేస్తున్న విద్యార్థులు

నల్లజర్ల: దూబచర్ల లయన్స్ క్లబ్, పార్ద్ ఇండియా స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏలూరు బ్లడ్ బ్యాంకు సౌజన్యంతో నల్లజర్ల ఏకేఆర్జీ కళాశాలలో సోమవారం రక్తదాన శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని కళాశాల కరస్పాండెంట్ వడ్లమూడి రామారావు ప్రారంభించారు. 23 మంది విద్యార్థులు రక్తదానం చేశారు. లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు కెల్లా వాసు, క్యాంపు ఆర్గనైజర్ అంబటి శ్రీనివాసరావు, నల్లజర్ల పార్ద్ ఇండియా సంస్థ అధ్యక్షుడు ఎండీ ఇలియాస్‌షరీఫ్, లయన్స్‌క్లబ్ జిల్లా చైర్‌పర్సన్ కూచిపూడి ఉదయభాస్కరావు, తాతిన సత్యనారాయణ, ఫార్మసీ, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాళ్లు రఘువీర్‌వర్మ, వట్టికూటి శివరామ్, సోమిశెట్టి వెంకట్రావు, రిటైర్డు పోస్టుమాస్టర్ రాంబాబు పాల్గొన్నారు.

ఇనాం భూములకు విముక్తి

పెరవలి: ఎన్నో ఏళ్ల ఇనాం పంట భూముల దస్తావేజులు లేక ఇబ్బందులు పడుతున్న రైతులకు ప్రభుత్వం తీసుకున్న చొరవతో హక్కు పొందే భాగ్యం లభించిందని రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ కె.సన్నిబాబు తెలిపారు. కానూరు అగ్రహారంలోసర్పంచ్ దాసం వెంకన్న అధ్యక్షతన సోమవారం గ్రామ సభ నిర్వహించారు. సన్నిబాబు మాట్లాడుతూ ఈ గ్రామంలో 1050 ఎకరాల పంట భూమి ఉన్నా నేటికీ ఎటువంటి దస్తాలు లేవన్నారు. వీటి వల్ల ఈ పంట భూములను సాగు చేస్తున్న 923 మంది రైతులు నష్ట పోతున్నారని తెలిసి ప్రభుత్వం రీ సర్వే చేయించి, రైతులకు న్యాయం చేసిందన్నారు. ఆర్ఐ భవానీ మాట్లాడుతూ ఈ గ్రామ సర్వే నిమిత్తం ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులతో మాట్లాడడం వలనే సర్వే పూర్తి చేయగలిగామని అందుకు గ్రామస్తుల సహకారం మరవలేనిదన్నారు. కార్యక్రమంలో రైతులు అందరూ చప్పట్లతో హర్షధ్వానాలు వ్యక్తం చేశారు. సర్వేయర్ గోపాల్‌కృష్ణ, నాయకులు దాసం బుజ్జి, రైతులు పాల్గొన్నారు.

టిప్పర్ ఇంజిన్ నుంచి మంటలు

నల్లజర్ల: పోతవరం శివారులో చికెన్ సెంటర్ సమీపంలో సోమవారం ఉదయం ఓ టిప్పర్ ఇంజిన్ నుంచి మంటలు చెలరేగాయి. నల్లజర్ల-కొయ్యలగూడెం రహదారి నిర్మాణ పనుల నిమిత్తం చిప్స్ అన్‌లోడ్ చేస్తున్న క్రమంలో టిప్పర్ ఇంజిన్ నుంచి మంటలు వచ్చాయి. ఇది గమనించిన డ్రైవర్ అప్రమత్తమై కిందకు దిగేశాడు. స్థానికులు స్పందించి రహదారికి ఇరువైపుల వాహనాల రాకపోకలు నిలిపివేసి ఇసుక, నీరు చల్లి మంటలు అదుపు చేశారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పింది.

అవయవదానానికి సంసిద్ధత పత్రం

నల్లజర్ల: సినీనటుడు మెగా స్టార్ డాక్టరు చిరంజీవి పద్మవిభూషణ్ అవార్డు అందుకున్న సందర్భంగా జిల్లా చిరు అభిమాన సంఘం సహాయ కార్యదర్శి రుద్రాశ్రీనివాస్ సోమవారం హైదరాబాదులో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తాను మరణించిన తర్వాత కళ్లు, అవయవాలను చిరంజీవి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా దానం చేసేందుకు సంసిద్ధత పత్రం చిరంజీవికి అందజేసినట్టు రుద్రాశ్రీనివాస్ తెలిపారు.

మోసగించిన వ్యక్తిపై కేసు

చాగల్లు: మహిళను నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై పి.నాగరాజు తెలిపారు. నెలటూరు గ్రామానికి చెందిన తొర్లపాటి సోనిని అదే గ్రామానికి చెందిన చింతపల్లి వెంకటేశ్వరరావు ప్రేమిస్తున్నానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించి మోసం చేశాడు. తీరా పెళ్లి చేసుకోమంటే మొఖం చాటేశాడు. దీంతో సోని సోమవారం ఇచ్చిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రాజ్యసభ సభ్యుల ఎంపికపై హర్షం



రాజ్యసభ సభ్యులుగా ఎంపిక చేసిన వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబురావు, మేడా మల్లికార్జునరెడ్డిలతో ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

కొవ్వూరు: రాజ్యసభ సభ్యులుగా వైవీ సుబ్బారెడ్డి, గొల్ల బాబూరావు, మేడా మల్లికార్జున రెడ్డిలను ఎంపిక చేయడంపై ఎమ్మెల్యే, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బీ-ఫాం అందుకున్న సందర్భంగా ముగ్గురు ఎంపీ అభ్యర్థులను కలిసి వెంకట్రావు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రాజ్యసభ ఎన్నికల్లో ముగ్గురు అభ్యర్థులు విజయం తథ్యం అన్నారు.

ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు

- ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు
- సమిశ్రగూడెంలో గ్రామ సచివాలయ, ఆర్‌బీకే, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలు ప్రారంభం

నిడదవోలు రూరల్: ప్రజలకు అందుబాటులో ప్రభుత్వ సేవలు అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకువచ్చారని ఎమ్మెల్యే జి.శ్రీనివాస్‌నాయుడు అన్నారు. సమిశ్రగూడెం గ్రామంలో రూ.80 లక్షలతో నిర్మించిన రెండు గ్రామ సచివాలయ భవనాలు, రూ.43.60 లక్షలతో నిర్మించిన రెండు రైతు భరోసా కేంద్రం భవనాలు, రూ.23.80 లక్షలతో నిర్మించిన వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ భవనం, రూ.22.20 లక్షలతో నిర్మించిన మండల పరిషత్ మొదటి అంతస్తు భవనాన్ని, పలు గ్రావెల్ రోడ్లను ఎమ్మెల్యే సోమవారం ప్రారంభించి శిలాఫలకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమిశ్రగూడెం గ్రామంలో గత 57 నెలలుగా రూ.38.52 కోట్లు సంక్షేమ పథకాలు అందించడంతో పాటు రూ.19.24 కోట్లతో అభివృద్ధి పనులు చేశామన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో పారదర్శకంగా అవినీతి రహిత పాలన అందిస్తున్నామని, లబ్ధిదారుల ఖాతాల్లోకే నేరుగా సంక్షేమ లబ్ధి అందిస్తున్నామన్నారు. రానున్న కాలంలో నియోజకవర్గాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ప్రజలంతా మద్దతు పలకాలని కోరారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ ద్వారా అందుతున్న సేవలపై ప్రజలంతా సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దేశాబత్తుల జ్యోత్స్నప్రియాంక, ఎంపీపీ తిరుమళ్ల భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు కొయ్యే సూరిబాబు, వైస్ ఎంపీపీ వడల రత్నకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు అంగర ఝాన్సీరాణి, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, గ్రామ, సొసైటీ అధ్యక్షుడు గజ్జరపు శ్రీరమేష్, రాష్ట్ర నాయకులు ముళ్లపూడి శ్రీనివాస్‌కుమార్ చౌదరి, కోఆప్షన్ సభ్యురాలు షేక్ గౌసియా, ఉపసర్పంచ్ గజ్జరపు నవరజిని, పార్టీ నాయకులు అంగర శ్రీను, షేక్ రహీం, కస్తూరి సాగర్, కొత్తపల్లి సత్యనారాయణ, దేశాబత్తుల నాగు, వడల అంబేడ్కర్, కోడూరి చంద్రరావు, గెద్దం రవీంద్రబాబు, ఎంపీడీఓ జేఏ ఝాన్సీ, పంచాయతీ కార్యదర్శి ప్రకాశరావు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డుసభ్యులు, పార్టీశ్రేణులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



సమిశ్రగూడెంలో గ్రామసచివాలయ భవనం ప్రారంభించిన ఎమ్మెల్యే శ్రీనివాస్‌నాయుడు, పార్టీశ్రేణులు

ఎన్నికల విధులపై వర్క్‌షాప్

- పోలీస్ సిబ్బందికి ఒకరోజు శిక్షణా తరగతులు
- శిక్షణ ఇచ్చిన డీఎస్పీ, సీఐలు

దేవరపల్లి: జిల్లా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు పర్యవేక్షణలో స్థానిక బీహెచ్ఎస్సార్ వీఎల్ఎం డిగ్రీ, పీజీ కళాశాలలో సోమవారం పోలీస్ అధికారులు, సిబ్బందికి ఒక రోజు వర్క్‌షాప్ నిర్వహించారు. కొవ్వూరు సబ్‌డివిజన్ పరిధిలోని కొవ్వూరు, నిడదవోలు, గోపాలపురం నియోజకవర్గాల నుంచి 115 మంది అధికారులు, సిబ్బంది వర్క్‌షాప్‌నకు హాజరయ్యారు. రాజమహేంద్రవరం నార్త్ జోన్ డీఎస్పీ కె.శ్రీనివాసరావు, కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు, దేవరపల్లి సీఐ కె.రామకృష్ణ, ధవళేశ్వరం సీఐ జి.వినయ్ మోహన్, సీఐ అనసూరి శ్రీనివాసరావు, దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు, గోపాలపురం ఎస్సై కె.సతీష్ సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామారావు మాట్లాడుతూ సబ్ డివిజన్ పరిధిలోని మూడు నియోజకవర్గాలోని కానిస్టేబుల్ నుంచి ఏఎస్సై ర్యాంకు వరకు సిబ్బందికి రాబోవు సార్వత్రిక ఎన్నికల విధుల గురించి శిక్షణ ఇచ్చినట్టు ఆయన తెలిపారు. పోలింగ్ ముందు రోజు, పోలింగ్ రోజు, పోలింగ్ తర్వాత ఏవిధంగా విధులు నిర్వహించాలనే దానిపై వర్క్‌షాప్ నిర్వహించినట్టు ఆయన తెలిపారు. ఎన్నికల కోడ్ వచ్చినప్పటిని అధికారులు, సిబ్బంది నిర్వహించవలసిన విధులు, పోలీస్ సిబ్బంది చేయాల్సిన పనులు, చేయకూడని పనుల గురించి వివరించి అవగాహన కల్పించినట్టు ఆయన తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వర్క్‌షాప్ నిర్వహించారు.



దేవరపల్లిలో సిబ్బందికి శిక్షణ ఇస్తున్న డీఎస్పీలు

ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలి

- ఏపీఎం విజయనిర్మల కుమారి
- మహిళా మార్ట్‌లో స్టాల్ ప్రారంభం

నల్లజర్ల: ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రోత్సహించాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం విజయనిర్మల కుమారి కోరారు. స్థానిక సొసైటీ భవనంలో నిర్వహిస్తున్న వైఎస్సార్ చేయూత మహిళా మార్ట్‌లో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల స్టాల్‌ను సోమవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతం కంటే ప్రస్తుతం అందరిలోనూ ఆరోగ్యంపై శ్రద్ధ పెరిగిందని, దీంతో ప్రకృతి సాగుతో చేసిన ఉత్పత్తులపై అందరూ మొగ్గుచూపుతున్నారని, దానికి అనుగుణంలో తదనుగుణంగా ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులకు అవగాహన కల్పించడంతో పాటు స్వయం సహాయక సంఘాల మహిళలను భాగస్వామ్యం చేయడంతో పాటు విక్రయదుకాణాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. వివిధ గ్రామాలలో మహిళా రైతులు ఎరువులు, పురుగుల మందులు వినియోగించకుండా ఆరోగ్యవంతమైన పంటలను పండిస్తున్నారని వివరించారు. తక్కువ ఖర్చుతో నాణ్యమైన ఉత్పత్తులను సాధిస్తున్నట్టు వివరించారు. వీరందరిని మనం ప్రోత్సహించాలన్నారు. ప్రతి సోమవారం ఈ స్టాల్‌లో కూరగాయలు, ఆకుకూరలు, బియ్యం, బెల్లం వంటి ఉత్పత్తులు ఇక్కడ విక్రయిస్తారన్నారు. కార్యక్రమంలో నాచురల్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ జూనియర్ ఎగ్జిక్యూటివ్ వరలక్ష్మి, మాస్టర్ ట్రినర్ శ్రీనివాసరావు, సీసీలు కనకదుర్గ, కోటేశ్వరి, మనోహర్, వినయ్, ఉమాదేవి పాల్గొన్నారు.



స్టాల్‌ను ప్రారంభిస్తున్న విజయనిర్మల కుమారి

మరోసారి అవకాశమివ్వండి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

పెరవలి: రాష్ట్రంలో త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పేదలకు, పెత్తందార్లకు మధ్య ఎన్నికల యుద్ధం జరగనుందని ప్రజలందరూ మరోసారి జగన్‌మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిని చేయడానికి సిద్ధంగా ఉన్నారని ఎమ్మెల్యే జి శ్రీనివాస్‌నాయుడు పేర్కొన్నారు. పెరవలి మండలం నడుపల్లిలో సోమవారం గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం సర్పంచ్ బీరా సత్యవేణి రాజు, సొసైటీ అధ్యక్షులు కరుటూరి భాస్కరరావు, ఉప సర్పంచ్ అన్నమరెడ్డి రవీంద్రనాథ్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగారు. ప్రభుత్వ పథకాలను వివరించారు. వారి సమస్యలను అడిగితెలుసుకున్నారు. సీఎం జగన్ మోహన్ అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలకు న్యాయం జరిగిందన్నారు. ఆయనకు మరోసారి అవకాశం ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కుమారుడు వరుణ్ సాయి ఎంపిపి కార్నెర్ల ప్రసాద్,వైఎస్సార్ సిసి మండల అధ్యక్షులు వీరమళ్ళ సత్యనారాయణ,కానూరు సర్పంచ్ భావన మధు, కంటిపూడి వెంకట రమణ, వైఎస్సార్ సిపి నాయకులు, వివిద గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నడుపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శ్రీనివాస్ నాయుడు

నోట్ పుస్తకాల పంపిణీ



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందజేస్తున్న సత్తిరాజు

దేవరపల్లి: సంగాయగూడెంలోని రెండు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలల్లో 60 మంది విద్యార్థులకు సామాజిక విశ్లేషకులు సుంకవల్లి సత్తిరాజు సోమవారం ఉచితంగా నోట్ పుస్తకాలు అందజేశారు. ఈ సందర్భంగా సత్తిరాజు మాట్లాడుతూ విద్య అనేది ప్రపంచంలో అత్యుత్తమమైన సంపద అన్నారు. విద్య ద్వారా జ్ఞానం ఆర్జించవచ్చని, విలువలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. బాల్యదశలో విద్య క్రమశిక్షణతో వికసించాలని ఆయన అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్నట్టు ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు గంగరాజు, నాగేంద్ర, ఉపాధ్యాయులు లక్ష్మీతులసి, శివ కుమార్, సుధాకర్ పాల్గొన్నారు.

కరాటేలో తపస్విరెడ్డి ప్రతిభ

నిడదవోలు : పట్టణంలోని నారాయణ విద్యా సంస్థలలో ఆరో తరగతి చదువుతున్న కుంచాల తపస్విరెడ్డి కరాటే పోటీల్లో ప్రతిభ కనబరిచాడు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో పవర్ కిక్ షోటోఖాన్ కరాటే డు అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన 4వ రాష్ట్ర స్థాయి కరాటే పోటీల్లో తపస్వీరెడ్డి అండర్-14 బ్లాక్ బెల్ట్ కటా విభాగంలో బంగారు పతకం, కుమిటీ పోటీలో కాంస్య పతకం సాధించాడు. ఈ సందర్భంగా తపస్విరెడ్డిని ప్రిన్సిపాల్ ఎస్.వేణుగోపాలరావు, రీజినల్ ఇన్‌చార్జి సురేష్, అకడమిక్ డీన్ మునీశ్వరరావు, ఏవో నాగేంద్ర, ఉపాధ్యాయులు అభినందించారు.



సాధించిన పతకాలతో తపస్విరెడ్డి

మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయం

నిడదవోలు: పట్టణాభివృద్ధిలో భాగంగా అన్ని వార్డుల్లో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలతో పాటు ప్రధాన సెంటర్లలో రోడ్ల విస్తరణ పనులు చేపడుతున్నట్టు మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. పట్టణంలోని 27వ వార్డులోని సంజీవయ్యనగర్‌లో గడపగడపకూ మన ప్రభుత్వం నిధులు రూ.10 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయన భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ మాట్లాడుతూ గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో వార్డు ప్రజల అభ్యర్థన మేరకు సీసీ రోడ్లు, డ్రైన్లు నిర్మిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ గంగుల వెంకటలక్ష్మి, కౌన్సిలర్లు కారింకి నాగేశ్వరరావు, గోపిరెడ్డి శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ నాయకులు పాలా మణికిరణ్, తోలేటి కోటేశ్వరరావు, ఎండీ ఫయాజ్, ఆలమూరి రాజశేఖర్, మున్సిపల్ డీఈఈ మాధవి, ఏఈ హేమంత్‌కుమార్, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు పాల్గొన్నారు.



రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ ఆదినారాయణ

సమన్వయంతో పని చేయాలి

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు

కొవ్వూరు: సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నాయకులందరూ సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే, నియోజకవర్గం వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు సూచించారు. సోమవారం పట్టణంలో 14వ, 15వ వార్డుల్లో నాయకులు పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యక్తిగతంగా స్థానిక నాయకులను వెంకట్రావు పరిచయం చేసుకున్నారు. వైఎస్సార్ సీపీని మరోసారి అధికారంలోకి తీసుకుని రావడానికి రానున్న రెండు నెలల పాటు సమయం కేటాయించాలని నాయకులు, కార్యకర్తలను కోరారు. మాజీ ఎమ్మెల్సీ కోడూరి శివరామకృష్ణ, మున్సిపల్ చైర్‌పర్సన్ బావన రత్నకుమారి, వైస్ చైర్‌పర్సన్ మన్నె పద్మ, కౌన్సిలర్లు రుత్తల భాస్కరరావు, అక్షయపాత్ర శ్రీనివాస రవీంద్ర, కంఠమణి రమేష్, బత్తి నాగరాజు, అంకోలు వెంకటలిల్లీ పద్మలీల, తోట లక్ష్మీ ప్రసన్న, మద్దిపట్ల సాయి గీత, చీరా అరుణ, పట్టణ యూత్ ప్రెసిడెంట్ సిద్ధన వాసు, యాసారపు శ్రీనివాస్, చీరా వెంకటరమణ, బోడపాటి హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలారి వెంకట్రావు

రైతు వ్యతిరేక విధానాలపై 16న నిరసన

రాష్ట్ర కార్మిక సంఘం ఉపాధ్యక్షుడు తాటిపాక మధు

పెరవలి: బీజేపీ అవలంబిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 16 వ తేదీన సంయుక్త కిసాన్ మోర్చ కార్మిక సంఘాల ఐక్యవేదిక తలపెట్టిన గ్రామీణ సమ్మెను రైతుల జయప్రదం చేయాలని కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు తాటిపాక మధు పేర్కొన్నారు. పెరవలి మండలం ముక్కామల, అన్నవరప్పాడు, కానూరు, ఖండవల్లి గ్రామాల్లో ఆయన సోమవారం పర్యటించి రైతులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ రైతు వ్యతిరేక విధానాలు వల్ల పంటకు గిట్టుబాటు ధర లభించక ఇప్పటికే రైతాంగం నష్టాల ఊబిలో కూరుపోయారని ధ్వజమెత్తారు. ఇటువంటి పాలకు చమరగీతం పాడేందుకు కార్మిక సంఘాలు ఐక్య వేదిక ద్వారా ఈ నెల 16 నిరసన తెలపాలన్నారు. జిల్లా రైతు సంఘం అధ్యక్షుడు పంతం నాగేశ్వరరావు మాట్లాడుతూ ఈ నిరసనకు మద్దతుగా కేంద్ర ప్రభుత్వ సంస్థలైన పోస్టాఫీసులు, బ్యాంకులు, ఎల్ఐసీ కార్యాలయాలు మూసివేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సిహెచ్ శ్రీనివాస్, ప్రసాద్, లక్ష్మణ్, నాగేశ్వరరావుతత, పుల్లయ్య, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రాముఖ్యాన్ని చాటేందుకే పద్య గళధారణ

కొవ్వూరు: మాతృ భాషా పరిరక్షణ సేవా సమితి ఆధ్వర్యంలో అపుస్మా సహకారంతో సోమవారం పరిమి రామారాయుడు, రత్తమ్మ కల్యాణ మండపంలో శత పద్య సహస్ర గళ ధారణ -వేమన శతకం కార్యక్రమం నిర్వహించారు. రాజమహేంద్రవరం, కొవ్వూరు పరిసర ప్రాంతాల్లోని 30కి పైగా పాఠశాలల నుంచి 1008 మంది చిన్నారులు 108 వేమన పద్యాలను రాగయుక్తంగా ఆలాపన చేశారు. తెలుగు భాషా వైభవాన్ని చాటి చెప్పి వేలాది చిన్నారుల్లో నైతిక విలువలను పెంపొందించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని సమితి సమన్వయకర్త సీహెచ్ వీఎస్ నాగభూషణం పేర్కొన్నారు. సమితి అధ్యక్షుడు చర్ల సుభాష్ చంద్రబోస్ మాట్లాడుతూ అమ్మలాంటి కమ్మనైన భాషా తెలుగు అన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ఎస్ఎల్ రామారావు, గోవర్ధనం శ్రీనివాసమూర్తి, మహా మహోపాధ్యాయ దోర్బల ప్రభాకర శర్మ, వివిధ పాఠశాలలకు చెందిన భాషా పండితులు పాల్గొన్నారు.



కొవ్వూరులో నిర్వహించిన వేమన శతక పద్య సహస్ర గళధారణకి హాజరైన విద్యార్థులు

కాపు సామాజిక భవనానికి 'కార్పొరేట్' నిధులు

బ్రాహ్మణగూడెంలో సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో భవనం నిర్మాణం

చాగల్లు: బ్రాహ్మణగూడెంలో కాపుల చిరకాల కోరిక నెరవేరింది. గత మూడు దశాబ్దాలుగా కమ్యూనిటీ భవనం నిర్మాణానికి చేసిన ప్రయత్నం ఇప్పుడు ఫలించింది. స్థానిక జెడ్పీటీసీ సభ్యురాలు గారపాటి విజయదుర్గా కృషితో సీఎస్ఆర్ నిధులు రూ.10 లక్షలతో చేపట్టిన కాపు కమ్యూనిటీ భవన నిర్మాణం చురుగ్గా సాగుతోంది. కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు, వైఎస్సార్ సీపీ కొవ్వూరు నియోజకవర్గ పరిశీలకులు ఎస్.రాజీవ్‌కృష్ణ ఈ నిధులు మంజూరుకు చర్యలు తీసుకున్నారు. దీంతో కాపు సామాజిక వర్గ నాయకులు, గ్రామస్తులు రాజీవ్‌కృష్ణకు ఆదేవిధంగా గారపాటి శ్రీనివాసరావుకు ధన్యవాదాలు తెలుపుతున్నారు.



బ్రాహ్మణగూడెంలో నిర్మిస్తున్న కాపు కమ్యూనిటీ హాల్